www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 2 ఏప్రిల్ 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



7న చంద్రబాబు రాక

35 నియోజకవర్గాల సమీక్ష


నారా చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈనెల 7న జిల్లాకు రానున్నారు. నెల్లూరు, చిత్తూరు, రాజంపేట, తిరుపతి, ఒంగోలు జిల్లాలకు చెందిన 35 నియోజకవర్గాల యూనిట్ క్లస్టర్ ఇన్‌ఛార్జులు, మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఐదు జిల్లాల నుంచి 2500 మంది ప్రత్యేక ఆహ్వానితులు ఈ సమావేశానికి రానున్నారు., తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి విజయంలో ఆపార్టీ నేతలు ఉత్సాహంతో ఉన్నారు. ఈ సమావేశ నిర్వాహకు స్థానిక వేణుగోపాల స్వామి దేవాలయ కాలేజ్ గ్రౌండ్‌లో జరగనున్నట్లు తెలుస్తోంది. ఏర్పాట్లు సంబంధించిన నేడు ఉమ్మడి నెల్లూరు జిల్లా సమన్వయకమిటీ సమావేశం టిడిపి కార్యాలయంలో జరగనుంది.

ఇఎస్ఐ డిస్పెన్సరికి మాయ రోగం..!

కార్మికులకు ప్రభుత్వ బీమా డిస్పెన్సరి పేరుతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఎస్ఐ ఆస్పత్రులకు మాయ రోగం పట్టుకుంది..జిల్లాలోని వివిధ పరిశ్రమలు, సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల జీతాల నుంచి ఇఎస్ఐ పేరుతో ప్రతి నెలా నగదు తీసుకుంటున్నారు. వైద్య రంగం కార్పొరేటీకరణ కావడంతో కార్మికులు వైద్యం, మందుల కోసం డిస్పెన్సరికి వెళు తుంటారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాలు, మందులు, వైద్యులను నియమించకుండా నిర్లక్ష్యం చేస్తుంది. ఉన్న వైద్యులున్నా సరిగా పనిచేస్తారంటే అది లేదు. తూతూ మంత్రంగా విధులు నిర్వహిస్తు, ప్రయివేటు ప్రాక్టీస్‌వైపు పరుగులు తీస్తున్నారు. మహిళా వైద్యులు లేకపోవడం, పట్టించుకునే నాధుడే లేకపోవడంతో ఇఎస్ఐ ఆసుపత్రులకు రోగులు వెళ్లడం లేదు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టి కార్మిక రోగులకు సేవలందించకపోతే ఈ కార్యాలయం మూసుకోవాల్సిందేనని తెలుస్తోంది.

- నిర్లక్ష్య వైద్యం
- మందులుండవ్.. మెడికల్ లీవ్ పేరుతో ఇబ్బందులు
- భారీగా తగ్గిన రోగులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రభుత్వం కార్మికులకు ఇఎస్ఐ ఆస్పత్రులు ఏర్పాటు చేసింది. జిల్లాలో సుమారు 25 వేల మంది కార్మికులు వివిధ సంస్థల్లో పనిచేస్తున్నారు. కనీసవేతనం ఇవ్వాలని, ఆరోగ్యం, ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని అనేక ఏళ్లుగా పోరాటం సాగిస్తున్నారు. జిల్లాలోని కార్మికులకు వైద్యసేవలు, ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించడానికి కోవూరు, ఏకె నగర్, స్టౌన్‌హౌస్‌పేటతోపాటు పలు ప్రాంతాల్లో ఆసుపత్రులు నడుస్తున్నాయి. ప్రతి నెలా కార్మికులకు వచ్చే అతికొద్ది జీతం నుంచి ఇఎస్ఐ, పిఎఫ్ కట్ చేసుకుంటున్నారు. ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే, వైద్యం చేయించుకోవడం, ఏ కారణం చేతనైనా విధులకు హాజరుకాక పోవడం వైద్యుల అనుమతితో ఇఎస్ఐ ద్వార జీతం అందిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఇఎస్ఐ ఆసుపత్రుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. కోవూరు డిస్పెన్సరినీ ఏకె నగర్‌లోని డిస్పెన్సరిలో విలీనం చేశారు. అక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బందికి ఇక్కడే పోస్టింగ్ ఇచ్చారు. గతంలో దీర్ఘకాలిక వ్యాధులు బిపి. సుగర్, వంటి రోగాలకు మందులు ఇచ్చేవారు. ఇటీవల కాలంలో వీటిని తగ్గించారు. కరోనాకు ముందు ప్రతి రోజూ ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఇఎస్ఐ ఆసుపత్రి పనిచేసేది. కరోనా సమయం నుంచి దీనిని ఉదయం 9 నుంచి 3 గంటల వరకు కుదించారు. ఈ సమయం వల్ల కార్మికులు పనులు సెలవులు పెట్టుకొని ఆసుపత్రికి రావాల్సి వస్తుంది. గతంలో ప్రతి రోజూ 150 మంది వరకు రోగులు వస్తుండగా, ప్రస్తుతం 30 మంది కూడా రావడం లేదు. కార్మికుని కుటుంబ సభ్యులకు ఇఎస్ఐ కార్డు వర్తిస్తుంది. వృద్ధులైన తల్లిదండ్రులు సుదూర ప్రాంతాల్లో ఉంటారు. ఎక్కువ మంది బిపి, సుగర్ వంటి దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడు తుండే వారు. వీరికి ప్రతి నెలా మందులు సరఫరా చేసేవారు. ఇప్పుడు ఆ రోగులు తీసుకొస్తేనే మందులు ఇస్తామని అక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బంది మొండికేస్తున్నారు. వంద రూపాయల మందుల కోసం రెండు, మూడు వందలు ఖర్చుపెట్టి ఆటోల్లో రాలేక అనేక మంది ఆసుపత్రికి రావడం మానేశారు. కార్మికులకు ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే 21 రోజులు మెడికల్ సెలవులు తీసుకునేందుకు అవకాశం ఉంది. ఇక్కడ పనిచేసే డాక్టర్లు పరిశీలించి సెలవు మంజూరు చేయాల్సి ఉంటుంది. ఇక్కడ ఉన్న వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి డాక్టర్ వద్ద సర్టిఫికెట్ తీసుకొస్తేనే మంజూరుచేస్తామని పెండింగ్ పెడుతున్నారు. అనేక మంది రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు మందులు సక్రమంగా అందు బాటులో ఉండడం లేదు. ప్రభుత్వం నుంచి సరఫరానే నిలిచి పోయిందనే తెలుస్తోంది. ఒక్కసారి ఇచ్చిన మందులు మరో సారి ఇవ్వరు. బయట కొనుగోలు చేసుకోమని ఉచిత సలహాలు ఇస్తున్నారు. అర్హతలేని వైద్య సిబ్బంది చేత మందులు సరఫరా చేయి స్తున్నారు. ఏ జబ్బుకు ఏ మందులు ఇస్తున్నారో తెలియని పరిస్థితి మరీ ధీన స్థితిలో ఉన్న కార్మికులు ఈ ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్నారు.

నగరంలోని ఏకె నగర్‌లో ఇఎస్ఐ ఆస్పత్రి

వైద్యుల నిర్లక్ష్యం...!

నగరంలోని ఏకె నగర్‌లో ఇఎస్ఐ ఆసుపత్రిలో ముగ్గురు వైద్యులున్నారు. అంతా 7 నుంచి 8 సంవత్సరాల అనుభవం కలిగినవారు. నిరుపేద రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇక్కడ వైద్యులకు ప్రత్యేక గదులున్నప్పటికీ ముగ్గురు వైద్యులు ఒకే గదిలో కూర్చొని పిచ్చపాటి మాట్లాడుకుంటూ కాలం గడిపేస్తున్నారని రోగులు అంటున్నారు. మహిళా వైద్యురాలు అందుబాటులో లేకపోవడంతో ఇక్కడకు వైద్యం కోసం వెళ్లి మహిళల సమస్యలు చెప్పుకోవాలన్న అవకాశం దొరకడం లేదని తెలుస్తోంది. సరైన మందులు ఇవ్వకపోవడం, వైద్యులు నిర్లక్ష్యంగా వైద్యం చేస్తుండడంతో రోగులు పెద్దగా రావడం లేదని తెలుస్తోంది. భారీగా తగ్గిపోయారని లెక్కలు చెబుతున్నాయి. మెడికల్ లీవ్ విషయంలోనూ వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. గతంలో ఉదయం 8 నుండి రాత్రి 8 గంటల వరకు డిస్పెన్సరీ ఉండేది. ఇప్పుడు కేవలం ఉదయం 9 నుంచి 3 గంట వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఈ సమయం రోగుకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. ఇక్కడ పనిచేసే ముగ్గురు వైద్యులు తూతూ మంత్రంగా వైద్యం చేసి, మధ్యాహ్నం నుండి తమ ప్రవేటు ప్రాక్టీస్‌లో కాలం గడుపుతున్నట్లు తెలుస్తోంది. పరిశ్రమలు, ప్రభుత్వం వైఖరి వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో చిన్నపాటి వైద్యసేవలందిస్తున్న ఇఎస్ఐ ఆసుపత్రిలో నిర్లక్ష్యంగా ఆవేదనకు గురైతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టి మందులు, వైద్య సేవల విషయంలో చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

న్యాయమూర్తికి బొకే అందజేస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్ర హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయిని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం నగరంలో నిర్వహించనున్న ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు నగరానికి ఆయన చేరుకున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని మినర్వా గ్రాండ్ ఓ ప్రైవేట్ హోటల్లో బసచేసిన హైకోర్టు న్యాయమూర్తిని కలెక్టర్ చక్రధర్ బాబు , జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఎంఎల్‌సి శ్రీకాంత్‌కు అభినందనలు

ప్రజాశక్తి -కందుకూరు : ఎంఎల్‌సిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా కందుకూరు వచ్చిన డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌ని కందుకూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో పాల్గొన్న కంచర్ల శ్రీకాంత్‌ని శాలువాతో సత్కరించి అభినందించారు. పందలపాడు గ్రామ టిడిపి అధ్యక్షులు కూనం సుబ్బారెడ్డి, నెల్లూరు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, పందలపాడు గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్ వర్ల నరేష్ , నెల్లూరు పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి వర్ల మహేంద్ర బాబు , కందుకూరు నియోజకవర్గం తెలుగుయువత కార్యదర్శి వర్ల కిషోర్ బాబు , పందలపాడు గ్రామ పోలింగ్ బూతు కన్వీనర్ వర్ల రాజేష్ బాబు , సీనియర్ కార్యకర్త చేవూరి ఏసు, వర్ల కోట య్య , వర్ల జాషువా , వర్ల పేతురు , గోచిపాతల బద్రి , వర్ల లెనిన్ , విసామ్యేలు ఉన్నారు.

మెగా డిఎస్‌సి ప్రకటించాలి

డివైఎఫ్ఐ డిమాండ్ - 3న 'చలో కలెక్టరేట్'

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్రం ప్రభుత్వం మెగా డిఎస్‌సిని తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 3న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శనివారం డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.వి.రమణ మాట్లాడు తూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి ఏటా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రస్తుత సిఎం నిరుద్యోగులకు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి 4 సంవత్సరాలు అవుతున్నా డిఎస్‌సి ప్రకటిం చకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నారంటూ ప్రభుత్వ తీరును విమర్శించారు. రాష్ట్రంలో టిటిసి,బీఈడీ చేసిన అభ్యర్థులు దాదాపు 10 లక్షల మంది అభ్యర్థులు డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. యువతకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు మరిచి నిరుద్యోగు లను నట్టేట్లో ముంచి వారి ఆత్మహత్యలకు ఈ ప్రభుత్వం కారణం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 నుంచి ఇప్పటిదాకా ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో దాదాపు 25 వేల పోస్టులకు పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉంటే మన విద్యాశాఖ మంత్రి మాత్రం నోటికి వచ్చిన లెక్కలు చెబుతున్నారని, కనీస అవగాహనా లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బిపి నరసింహ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు పరమావధిగా పరిపాల చేస్తున్నారే తప్ప , ప్రభుత్వ శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేసే విధంగా నోటిఫికేషన్లు విడుదల చేసే దిశగా ఎక్కడ ఆలోచన చేసిన పాపాన పోలేదన్నారు. అందుకే గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి ఎన్నికల్లో బలమైన తీర్పు ఇచ్చారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని పాదయాత్ర సమయంలో యువతకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ నాయకులు కండె కోటేశ్వరరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

టిడిపి నగర అధ్యక్షుడిగా 'మామిడాల'

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడుగా మాజీ కార్పొరేటర్ మామిడాల మధును నియమించారు. చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె. అచ్చెన్నాయుడు ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటి వరకు నగర టిడిపి అధ్యక్షులుగా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఉన్నారు. ఆయనకు కాలు యాక్సిడెంట్ అవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

మామిడాల మధు

పేదలకు అత్యాధునిక వైద్యసేవలు : ఆదాల

ప్రజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలోని పేద ప్రజలందరికీ అత్యాధునిక వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా "పట్టణ ఆరోగ్య కేంద్రాలు" పనిచేస్తాయని ఎం.పి ఆదాల ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక 34వ డివిజను పొదలకూరు రోడ్డులో నూతనంగా నగరపాలక సంస్థ నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలో లేని కొన్ని వ్యాధులను సైతం ప్రభుత్వం ఈ పథకంలో చేర్చి పేదలందరికీ ఆరోగ్య భద్రత కల్పిస్తుందన్నారు. సాధారణ చెక్‌అప్ లతో పాటు అవసరమైన అన్ని మందులను ఉచితంగా అందజేసి ప్రజలపై ఆర్థిక భారం లేకుండా అన్ని చర్యలు ఈ ప్రభుత్వం తీసుకుందాన్నరు. వయో వద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో ఉన్న చిన్నారులు స్థానిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి అనుభవజ్ఞులైన వైద్యుల వైద్య సహాయం పొందాలని సూచించారు. భాగంగా స్థానిక 19వ డివిజన్ మినీ బైపాస్, గోమతి నగర్, దం రో షో రూమ్ సమీపంలో డ్రైను కాలువల నిర్మాణ పనులకు ఆయన శంఖుస్థాపన చేశారు.స్థానిక ప్రగతి నగర్ కూడలిలోని 34/1 వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందు తున్న వివిధ సంక్షేమ పథకాల అమలును కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. నాయకులు ఆనం విజయ్ కుమార్ రెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డి, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాద్, స్థానిక కార్పొరేటర్ షేక్ ఫమేదా, నగర పాలక సంస్థ కార్పొరేషన్ కమిషనర్ శ్రీమతి హారిత ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ సంపత్ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

23న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభ

నెల్లూరు : ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు ఈనెల 23వ తేదీ ఆదివారం యల్లాయపాళెం ప్రాంతంలోని కడివేటి వెంకయ్య ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి నంది పోగుల రమణయ్య పేర్కొన్నారు. శనివారం నగరంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ శ్రమజీవుల కోసం భూస్వాముల పెత్తందారుల దోపిడీల ను ఎదిరించే క్రమంలో జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పడిందన్నారు. ఈ సంఘం నేడు దేశవ్యాప్తంగా విస్తరించిందన్నారు. ఇంతటి సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు ఈనెల 23వ తేదీన యల్లాయపాళెంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిధిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం ఏపి అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ తదితరులు హాజరవుతారన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు వి రామరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు సిరాజ్ షాన్వాజ్, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు షేక్ ఫరీదా ఎస్.కె ఎస్దాని రూరల్ మండలం సిపిఐ సహాయ కార్యదర్శి ఆదినారాయణ ఈ వై ఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా పాల్గొన్నారు.

బివి రమణకు అవార్డు

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరుకు చెందిన ఉపాధ్యాయుడు బి.వి రమణకు జాతీయ సేవా పురస్కారం దక్కింది. నెల్లూరు విశ్వంభర చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు సువర్ణ కుమారి చేతుల మీదగా బివీ రమణకు జాతీయ సేవా పురస్కారం శనివారం అందజేశారు. అమ్మవెల్‌ఫేర్ సొసైటీ తరపున పేద విద్యార్థిని, విద్యార్థులకు చదువులకు సంబంధించిన సామాగ్రి ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో చదివేవారికి అందజేస్తున్నారు. విద్యార్థులకు యోగ ,ధ్యానం, నైతిక విలువలు పెంపొందించే విధంగా శిక్షణా తరగతులు రమణ ఉచితంగా నిర్వహిస్తారు. కరోనా సమయంలో ఎంతోమందికి ఈవిధ రకాలుగా సేవలు అందించారు. అవార్డు వచ్చిన సందర్భంగా స్నేహితులు, బంధువులు ,పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

అవార్డు అందుకుంటున్న బివి రమణ

రెవెన్యూ ఉద్యోగుల పనితీరు అభినందనీయం : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు

అన్ని ప్రభుత్వశాఖల్లోకెల్లా రెవెన్యూ శాఖకు ప్రత్యేక గుర్తింపు ఉందని, జిల్లాలో రెవెన్యూ ఉద్యోగుల పనితీరు ప్రశంసనీయమని కలెక్టర్ కె వి ఎన్ చక్రధర్ బాబు పేర్కొన్నారు. శనివారం నగరంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలోని పాత జూబ్లీ వైద్యశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తన తండ్రి రెవెన్యూ శాఖలో తహశీల్దారుగా విధులు నిర్వర్తించి రిటైర్ అయ్యారని, చిన్నప్పటి నుంచి రెవెన్యూ శాఖతో తనకు మంచి అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. తాను కూడా రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి కలెక్టర్ స్థాయికి ఎదిగానని, రెవెన్యూ ఉద్యోగుల సహకారంతో ఎక్కడా లోటుపాట్లు లేకుండా విధులు నిర్వహించగలుగుతున్నానని పేర్కొన్నారు. రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు తమ అనుభవాలను ప్రస్తుతం పనిచేస్తున్న రెవెన్యూ ఉద్యోగులతో పంచుకుని, విధి నిర్వహణలో వారికి సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా ప్రజలకు దగ్గరగా ఉండి మెరుగైన సేవలు అందించిన రెవెన్యూ ఉద్యోగులు, పదవీ విరమణ అనంతరం మంచి ఆరోగ్యంతో ప్రశాంతమైన కుటుంబ జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. రిటైర్డ్ ఉద్యోగులందరూ కలిసి ఈ కార్యాల యాన్ని ప్రారంభిం చుకోవడం చాలా సంతోషమని, ఉద్యోగులకు తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని రెవెన్యూ ఉద్యోగులకు భరోసా ఇచ్చారు. చివరగా కలెక్టర్ ను రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. రిటైర్డ్ రెవెన్యూ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు పెంచలరెడ్డి, అధ్యక్షులు ముత్యం నరసింహులు, కార్యదర్శి జి వేణుగోపాల్, కోశాధికారి సుధాకర్ ఉన్నారు.

కలెక్టర్‌ను సన్మానిస్తున్న విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు

'ప్రకాశం'లో రామయ్య జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -కందుకూరు

గతం కంటే భిన్నంగా రెండు శుభ పరిణామాల నేపథ్యంలో జరుగుతున్న తన పుట్టినరోజు వేడుకలు కాలేజీకి, విద్యార్థులకు, అధ్యాపకులకు భవిష్యత్ శుభ సూచికం కావాలని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ఆకాంక్షించారు. అనూహ్యంగా తనకు జరిగిన బైపాస్ సర్జరీ విజయంతో పెరిగిన ఆయుష్, కాలేజీ డైరెక్టర్ చట్ట సభకు భారీ మెజార్టీతో ఎమ్మెల్సీగా గెలుపు శుభ పరిణామాలుగా ఆయన అభివర్ణించారు. మరో నెల రోజుల్లో తాను మరింత ఆరోగ్యంతో పుంజుకొని విద్యార్థులకు అధ్యాపకులకు భవితకు తోడ్పడే ప్రణాళికలను అమలుకు పూను కుంటానని ఆయన హామీ ఇచ్చారు. చట్టసభల్లో అడుగుపెట్టిన శ్రీకాంత్ తనవంతు కషితో కాలేజీ ప్రగతికి తోడ్పడగలరని ఆశ భావాన్ని వ్యక్తం చేశారు. సభాధ్యక్షులు, టెక్నికల్ డైరెక్టర్ కంచర్ల విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ హదయ బైపాస్ తర్వాత కరస్పాండెంట్ శక్తివంతునిగా అయిన తీరు కచ్చితంగా కాలేజీ అభివద్ధి, విద్యార్థులు, సిబ్బంది సంక్షేమానికి ఉపయోగపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్.రవికుమార్ మాట్లాడుతూ ఈ రెండు పరిణామాల ప్రకాశం ప్రగతికి దోహద పడతాయనడం నిసందేహమని అధ్యాపకులు, విద్యార్థుల హర్ష ద్వానాల మధ్య ప్రకటించారు. గతంలో ప్రజాశక్తిలో ప్రచురితమైన ఈ పెద్దాయన కాలేజీ మొత్తానికి డాడీ వ్యాసాన్ని అధ్యాపకులు విద్యార్థులు చిత్రపటంగా రూపొందించి శనివారం కరస్పాండెంట్ రామయ్యకు పుట్టినరోజు కానుకగా అందజేశారు. హ్యుమానిటీస్ విభాగం హెచ్‌ఓడి జి. ప్రసాద్, సి.ఎస్.సి హెచ్ ఓ డి ఎం.ఎం. రాయుడు, అడ్మిషన్స్ ఇన్చార్జి డి. కొండలరావు విద్యార్థులు కిలారి లావణ్య చౌదరి, సి.హెచ్. యాని ఆశ్రిత, పి. బేబీ, ఎం .ఉమా మహేశ్వరి, కె.అనూష, డి.వైష్ణవి పాల్గొన్నారు.

రామయ్యకు జన్మదిన సందర్భంగా ప్రజాశక్తి వ్యాసాన్ని ఫొటోగా చేసి జ్ఞాపికగా అందజేస్తున్న సిబ్బంది,విద్యార్థులు


రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది, విద్యార్థులు

బధిరుల పాఠశాలలో ..

కోవూరు రోడ్డులోని స్వర్గస్వయం కషి మానసిక వికలాంగుల పాఠశాలలో కంచర్ల రామయ్య పుట్టిన రోజు సందర్భంగా మెకనికాల్ ఇజనిరింగ్ బ్రాంచ్ హెచ్‌ఓపి జీవి పూమా 800 మానసిక వికలాంగుల పిల్లలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కంచర్ల రామయ్య పుట్టిన రోజు మానసిక వికలాంగుల పిల్లల మధ్య జరపడం ఎంతో ఆనందంగా వుందన్నారు. దివ్యాంగులకు సేవా చేయడం ఒక వరం అన్నారు.పాఠశాల కరస్పాండెంట్ 5. సుబ్బారెడ్డి ఉన్నారు.

2024 ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయం : కంచర్ల

ప్రజాశక్తి -కందుకూరు

2024 జరిగే ఎన్నికలో టిడిపిని కార్యకర్తలు ఐక్యంగా ఉండి గెలిపించి నారా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేయాలని నాయకులు పిలుపు ఇచ్చారు. కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌కి అభినందన సభ, కందుకూరులోని శ్రీ వెంగమాంబ కళ్యాణ మండపంలో శనివారం జరిగింది. కంచర్ల శ్రీకాంత్‌తో పాటు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిని నేతలు, కార్యకర్తలు సన్మానించారు. అంతకుముందు పట్టణంలోని స్వర్గీయ దివి కొండయ్య చౌదరి, బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాలకు నేతలందరూ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సన్మాన సభలో నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్, నియోజకవర్గ ఇన్చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం, కనిగిరి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, ప్రకాశం జిల్లా డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు ప్రసంగించారు. కందుకూరు పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, వేముల గోపాలరావు, నియోజవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు దివి సౌభాగ్య, పార్టీ రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ, మండల కమిటీల నాయకులు, అన్ని గ్రామాల సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేల సంఖ్యలో కార్యక్రమానికి తరలివచ్చారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్

కందుకూరులో భారీ వర్షం

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరులో శనివారం ఉడుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పెద్ద పెద్ద శబ్దాలతో ఉడుములు రాక ఈదురు గాలుల్లో వీశాయి. దీంతో అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. రోడ్లపై వర్షం నీరు ప్రవహించింది. చెట్లు విరిగి కరెంటు స్తం భాలపై పడ్డాయి. సాయంత్రం మూడున్నర గంటల నుండి విద్యుత్ సరఫరా కి అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా పునరుద్ధరించడానికి సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. కరెంటు తీగలు ఎక్కడ తెగిపడ్డాయో ఎతకడానికి కష్టమైంది. అకాల వర్షంతో పంటలకు నష్టం కలిగింది. పొగతోటల్లో జిడ్డు కారిపోయి ఆకు నాణ్యత కోల్పోయే విధంగా ఈ వర్షం పడిందని రైతులు చెప్పారు. మామిడికాయలు కూడా నేలరాలినట్లు తెలిసింది.

24 సార్లు రక్తదానం

ప్రజాశక్తి -కందుకూరు : 24వ సారి రక్తదానం చేసి గొప్ప మానవత్వాన్ని చాటుకున్న కందుకూరు వైసిపి సోషల్ మీడియా అయుబ్ ఖాన్ పఠాన్ సింగరాయకొండ చెందిన సుబ్బారావు ఒంగోలు కిమ్స్ హాస్పిటల్లో ఓపెన్ హార్ట్ సర్జరీ నిమిత్తం ఓ పాజిటివ్ రక్తం 4 యూనిట్లు అవసరమైంది. ఆ గ్రూప్ రక్తం దొరక్క ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఎస్ఎన్ఆర్ నాయబ్ రసూల్ ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ సభ్యులకి తెలియ పరిచారు. స్పం దించి రక్తదానం చెయ్యటానికి వెంటనే ముందుకొచ్చి వారికి భరోసా కల్పించారు. శనావారం ఒంగోలు కిమ్స్ కి వెళ్లి రక్తదానం చేసి తమ సామాజిక బాధ్యతని చాటుకొని ప్రాణదాతలుగా నిలిచి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. రక్తదానం చేసిన అయుబ్ ఖాన్ పఠాన్‌ని రక్తం పొందిన వ్యక్తి, ఆయన కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

ఎంఎల్‌సిలకు 'పోతుల' అభినందనలు

ప్రజాశక్తి -కందుకూరు : తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ ,పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో మాజీ శాసనసభ్యులు పోతుల రామారావు అభినందించారు. పలువురు నాయకులు ఉన్నారు.

కూరగాయల షాపు ప్రారంభం

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు రైతుబజార్‌లో వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన జిల్లెల్లముడి వెంకటేశ్వర్లు నూతనంగా ఏర్పాటు చేసిన సేంద్రియ కూరగాయల షాపును జిల్లా ప్రకతి వ్యవసాయ అధికారి (డిపిఎం) మాలకొండయ్య చేతులు మీదుగా శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గణేశం గంగిరెడ్డి, డాక్టర్ తన్నీరు మల్లికార్జున, చన్నా రామాంజనేయులు, చీదెళ్ళ వేణుగోపాలరావు, చక్కా వెంకట కేశవరవు, వ్యవసాయ అధికారులు, ఎస్టేట్ అధికారి పద్మనాభరావు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి -పొదలకూరు : పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం ఉన్నాయి. మండలంలో ఈ పరీక్షల కోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలో 793 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరి కోసం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని డివిఎన్ఆర్ జిల్లా పరిషత్ బాలుర,బాలికోన్నత పాఠశాలలు, మహమ్మదాపురం ఉన్నత పాఠశాల తో పాటు నాగార్జున హైస్కూల్ ను పరీక్షా కేంద్రాలుగా కేటాయించారు. ఆయా కేంద్రాలకు కేటాయించబడిన అధికారులు చురుకుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

పొదలకూరుకు పిహెచ్‌సి మంజూరు

ప్రజాశక్తి -పొదలకూరు : పొదలకూరు మండలానికి కొత్తగా మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. మండలంలో ఎక్కడ ఏర్పాటు చేస్తారనే అనే అంశంపై స్పష్టత లేదు. వైద్యులుగా డాక్టర్ కిరణ్ రిషిత, డాక్టర్ కావ్య లను నియమించినట్లు సమాచారం. అప్పటి వరకు వీరు పొదలకూరు లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ డాక్టర్లుగా విధులు నిర్వహిం చాలని ఆదేశించినట్లు మహ్మదాపురం ప్రాథమిక వైద్యశాల డాక్టర్ రమేష్ తెలిపారు.

దిగజారుడు రాజకీయాలకు దూరం : వైసిపి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : వైసిపి దిగజారుడు రాజకీయాలకు పాల్పడదని వైసిపి నాయకులు పేర్కొన్నారు. మాజీ మంత్రి సోమిరె డ్డి చంద్రమోహన్ రెడ్డి జన్మది నాన్ని పురస్కరించుకొని మహాల క్ష్మీపురంలో అభిమానులు ఏ ర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తె లియని వ్యక్తులు గత నెల 30వ తేదీన తగులబెట్టిన విషయం తెలిసిందేదీనిపై సోమిరెడ్డి ఫ్లె క్సీని స్థానిక వైసీపీ నాయకులే దగ్ధం చేశారంటూ టిడిపి నా యకులు వీరబోయిన గంగా ధర్, మాజీ సర్పంచ్ ఊటుకూ రు శ్రీనివాసులు, తదితరులు ఆరోపించారు. ఈ ఆరోపణలను శనివారం ఏర్పాటు చేసిన మీడియా స మావేశంలో వైసీపీ నాయకులు కోడూరు దిలీప్ కుమార్ రెడ్డి, కావల్ రెడ్డి రంగారెడ్డి తీవ్రంగా ఖండించారు. దువ్వూరు శ్రీనివాసుల రెడ్డి, ఆగాల శ్రీనివాసు లు రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కంజినీలమ్మ .సురేష్ తేలుమేటి ఉదయ్, పామంజి మల్లికార్జున్ ఉన్నారు.

విద్యార్థులకు అల్పాహారం

ప్రజాశక్తి మర్రిపాడు : మండలంలోని చుంచులూరు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ సమయంలో గ్రామానికి చెందిన నాగరాజుపల్లి వెంకటసుబ్బయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు రాజా పర్యాద రావు సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సి ప్రసాద్‌లు గత నెల రోజులుగా అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారు. శనివారం వారి తల్లి పద్మావతమ్మ చేతుల మీదుగా విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పద్మావతమ్మను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ మాట్లాడుతూ గత 4 సంవత్సరాలుగా ప్రత్యేక తరగతుల సమయంలో తను చదివిన పాఠశాల అభ్యున్నతి కోసం పర్యాద ఎస్ఐ, వారి కుటుంబ సభ్యులు సొంతఖర్చుతో అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో కలిశెట్టి రాజేంద్రకుమార్, కలిశెట్టి వంశీ, విశ్రాంత ఉపాధ్యాయులు కంచి అరుణ, పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ విష్ణు కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అతివేగం ప్రమాదకరం

ప్రజాశక్తి-ఉదయగిరి : ద్విచక్ర వాహనదారులు యువకులు నడిపే అతివేగం ప్రమాదకరమని సిఐ గిరిబాబు అవగాహన కల్పించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయం ఎదుట ద్విచక్ర వాహనదారులకు యువకుల అతివేగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమైందని కుటుంబం ఆధారపడి ఉంటుందని తెలిపారు. అధికంగా వాడే బైక్ సైలెన్సర్ నిషేధమని ఎవరైనా అధికంగా సౌండ్ వచ్చే సైలెన్సర్లు వాడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. బయటకు వచ్చే ప్రతి వ్యక్తి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఎస్ఐ ఎన్.ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎస్ఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కడనూతల గ్రామంలో ఉన్న ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం హెచ్‌సిఎల్ కంపెనీలో నెట్వర్క్ అనలిస్ట్ ఉద్యోగాల కోసం పాత్ క్రియేటర్స్ సొల్యూషన్స్ నుంచి ఆపరేషన్ మేనేజర్ నవనీత రాజమణి, శ్యామల ప్రాంగణ ఎంపికలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.వి. ఎస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంగణ ఎంపికలకు మొత్తం 135 మంది హాజరవగా ఇందులో 30 మంది ఫైనల్ ఎంపికయ్యారని, ఎంపికైన విద్యార్థులకు 2.5 నుండి 3.5 లక్షలు మధ్య వార్షిక వేతనం ఉంటుందని, బెంగళూరు నగరంలో గానీ చెన్నయ్ నగరంలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రాజారెడ్డి ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఎ.ఓ. రమణారెడ్డి, అన్ని విభాగాధిపతులు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడి సాగుపై అవగాహన

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామ రెవెన్యూ పరిధిలోని వడ్డిపాలెం గ్రామంలో మామిడి రైతులకు మామిడి సాగు ప్రస్తుతం తీసుకోవలసిన జాగ్రత్తలు మార్కెటింగ్ చేసే విధానం గురించి ఉద్యాన శాఖ తరఫున శనివారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యాన శాఖ అధికారి సుధామయ పాల్గొని రైతు పొరుగులతో ప్రస్తుతం మామిడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మెలకువల గురించి సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి గోవింద్ స్వామి, ఎన్.వి.పాలెం సర్పంచ్ బెల్లంకొండ శీను ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులు వారికి ఉన్న సమస్యలు మామిడి సాగులో ఎదురవుతున్న ఇబ్బందులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జువ్వలదిన్నె రైతు భరోసా కేంద్రం సభ్యులు, వి.ఎన్.పాలెం రైతు భరోసా కేంద్రం సభ్యులు రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల పోషణ పక్వాడ్

ప్రజాశక్తి-అల్లూరు : మండల కేంద్రం స్థానిక వినాయక నగర్‌లో శనివారం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు పలు విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు అతి తక్కువతో ఖర్చుతో చిరుధాన్యాలను వినియోగించుకొని తెలియజేశారు. అతి తక్కువతో లభించే ఆకుకూరలు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు.

ప్రజాశక్తి-కలిగిరి: టిపిపాలెం ఎంపిపి స్కూల్ పరిధిలోని అంగన్వాడి సెంటర్లో పోషణ పక్షోత్సవాలు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఉమ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని అదేవిధంగా తెలియజేశారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రెడ్‌క్రాస్ పాలకమండలి ఎన్నికలు

ప్రజాశక్తి-నెల్లూరు : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా పాలక మండలికి ఆదివారం ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా పాలక మండలికి అవసరమైన 15 మంది సభ్యుల ఎంపిక కోసం ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ ఓటింగ్ ప్రక్రియలో రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 34 మంది సభ్యులు ఈ ఎన్నికల బరిలో నిలుచున్నారు. నగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో, కావలిలో రెండు చోట్ల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా పాలక మండలికి అవసరమైన 15 మంది సభ్యులను ఎన్నుకోనేందుకు దాదాపుగా 7వేల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఒక్కొక్క సభ్యుడు పాలక మండలి అవసరమైన 15 మంది సభ్యులకు మాత్రమే ఓటు వేయాల్సి ఉంటుంది. పొరపాటున 16వ సభ్యుడికి ఎవరైనా ఓటింగ్ చేస్తే ఆ ఓటు ఇన్‌వ్యాలిడ్ అవుతుంది.

తూ.తూ. మంత్రంగా ఐఎబి సమావేశం

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లా రైతాంగం రెండు పంటలు సాగుబడి చేసుకొనేందుకు దోహదపడే ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు (సాగునీటి సలహా మండలి, వ్యవసాయ సలహామండలి) సమావేశం రైతులకు ఆవేదన మిగిల్చింది. జిల్లా రైతాంగం రెండు పంటలు సాగుబడి చేసుకొనేందుకు అవసరమైన నీరు కేటాయింపుకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొనేందుకు ఈ సమావేశం ఎంతో కీలక భూమికను పోషిస్తుంది. అయితే ఈ సమావేశంలో పాల్గొని రైతుల కష్టాలు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు మాట్లాడాల్సిన శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులు ఆ దిశగా మాట్లాడకపోవడం పలు విమర్శలకు దారి తీస్తుంది. ఈ సమావేశం జరిగిన తీరు పరిశీలిస్తే తూ.తూ. మంత్రంగా జరిగిందని చెప్పుకోవచ్చు. జిల్లాలో ఏ ప్రాంతంలో రైతులు ఏ పంట సాగుబడి చేస్తున్నారు.. ఆ పంట రైతు చేతికి అందివచ్చేంత వరకు నీరు ఎంత అవసరం.. ఏ తరహాలో కేటాయింపులు చేయాలో మాట్లాడిన దాఖలాలు లేవు. ఇద్దరు ఎంఎల్‌ఏలు పాల్గొంటే ప్రభుత్వ పాలనకు మద్దతుగా మాట్లాడేందుకు మాత్రమే సమయం అంతా సరిపోయింది. రైతుల సమస్యలపై మాట్లాడిన వారే లేరు. వ్యవసాయ సంఘం, రైతు సంఘం సభ్యులు చివరి వరకు వేచి చూసి రైతుల సమస్యలను, ఆ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం ఏ విధమైన నిర్ణయాలు తీసుకోవాలో సూచిస్తూ కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ వినతిపత్రాలను పరిశీలించి రైతుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా ఆలోచన చేస్తారో లేక ప్రజాప్రతినిధుల కంటే తామేమీ తక్కువ కాదన్న విధంగా వ్యవహరిస్తారో చూడాల్సి ఉంది. కార్మిక, కర్షక సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమానికి అధిక సంఖ్యలో కార్మికులు, కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ నగరంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని నిరుద్యోగ యువతకు హామీ ఇచ్చి వారి ఓట్లతో గెలుపొంది అధికారంలోకి వచ్చిన అనంతరం నాలుగు సంవత్సరాలైనా హామీని అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఏప్రిల్ 3వ తేదీన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఏప్రిల్ 3వ తేదీన 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కరోనా తరువాత జరుగుతున్న ఈ పరీక్షలు విద్యార్థుల తల్లిదండ్రులను ఒకింత కలవరపాటుకు గురిచేస్తున్నాయి. అంతే కాకుండా ప్రతి ఏడాది 10వ తరగతి పరీక్షలు 11 పేపర్లతో నిర్వహిస్తుండగా ఈ ఏడాది ప్రభుత్వం ఆ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభం కావడంతో ఆ పేపర్ల సంఖ్యను 6 కు కుదించింది. దీని వల్ల విద్యార్థులు ఒక రకమైన వత్తిడికి గురౌతున్నారు. ఈ ఏడాది పది పరీక్ష ఫలితాలు ఏ విధంగా వస్తాయో వేచి చూడాల్సిందే.

వీక్షణం

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి-కావలి

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రాధాన్యతా పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో డివిజన్ స్థాయిలోని అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్ బాబు పేర్కొన్నారు. కావలి రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయ ఆవరణలో నూతనంగా పునర్నిర్మించిన సమావేశ మందిరాన్ని శనివారం ఆర్.డి.ఒ వి.కె. శీనానాయక్‌తో కలసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రాధాన్యతా పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో డివిజన్ స్థాయిలోని అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాకు మంచిపేరు తీసుకు రావాలన్నారు. ఈ సంవత్సరం వేసవి కాలంలో ఎక్కువ ఉష్ణోగతలు పెరిగే అవకాశం ఉందని, వాతావరణ శాఖ

సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

తెలిపిన నేపథ్యంలో ప్రజలు ఎక్కడా తాగునీటికి ఇబ్బంది పడకుండా ముందస్తు ప్రణాళికతో సంబంధిత శాఖల అధికారులు ముందుకు వెళ్లాలన్నారు. ఈ వేసవిలో డివిజన్ పరిధిలో తాగునీటి సమస్యను అధిగమించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రధాన రహదారి కూడళ్ల వద్ద స్కూల్స్, హాస్పిటల్స్, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద తాగునీటి వసతి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెండో పంటకు కూడా సాగు నీరు ఇస్తామని తెలిపారు. కావలి పట్టణ పరిధిలో అందరికీ ఇళ్ల కార్యక్రమం కింద మెగాలేఅవుట్‌లో పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ఈ మెగా లే అవుట్‌లో 3 వేల గృహాలు ఒకేసారి గృహప్రవేశాలు జరిగేలా ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయడానికి అన్నీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ భూమికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చుక్కల భూముల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో ఒక ప్రత్యేక సెల్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో డి.ఎస్.పి వెంకటరమణ, ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు, తహశీల్దార్ మాధవరెడ్డి, ఎంపిడిఒ ఎ.వి.సుబ్బారావు, ఆర్.డి.డి తహశీల్దార్, కార్యాలయపు సిబ్బంది, తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సిపిఎం, రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. మండలంలోని అనేక గ్రామాల్లో రైతులు వరి ధాన్యాన్ని పండించి ప్రభుత్వం అధికారులు కొనుగోలు చేయక పోవడంతో ధాన్యాన్ని ఎండబెట్టుకుంటూ నానా ఇబ్బందులు పడుతున్నారు. మద్దతు ధర కంటే తక్కువ రేటుకు దళారులకు అమ్ముకుంటున్నారని వెంటనే మండలంలో మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. సిపిఎం మండల నాయకులు అన్వర్ బాషా, రైతు సంఘం మండల అధ్యక్షుడు రాచకొండ పెంచలనాయుడు, రైతు సంఘం మండల కార్యదర్శి ఉప్పలపాడు మస్తాన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో వారు మాట్లాడుతూ అసలే వ్యవసాయ ఖర్చులు పెరిగి రైతులు అప్పుల బాధల్లో ఉంటే ఇప్పుడు ప్రభుత్వాధికారులు రైతుల వద్ద నుంచి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కు ధాన్యం కొనుగోలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. అనేకమంది రైతులు మద్దతు ధర లేక

ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు

దళారులకు ధాన్యాన్ని అమ్ముకోలేక నరకయాతన పడుతున్నారన్నారు. ఎండలో ధాన్యాన్ని ఎండ బెట్టుకుంటూ రాత్రి, పగలు కాపలా కాస్తున్నారన్నారు. చినుకు పడి ఒక్క గింజ తడిసిన మళ్లీ కొనుగోలు రేటు తగ్గించి పదివేలు, 8 వేలకే దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. మండల వ్యవసాయ అధికారులు, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మండలంలో మూడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రైతుల వద్ద నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేయా లన్నారు. ప్రభుత్వ నిర్ణయించిన రేటుకు ధాన్యం కొనుగోలు చేయాలని, లేని పక్షంలో రైతులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. కలెక్టర్ స్పందించి రైతుల బాధలను అర్థం చేసుకొని మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

నిరసన వ్యక్తం చేస్తున్న పసుపు రైతులు

పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

పసుపు రైతులకు మద్దతు ధర కల్పించి తక్షణమే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎపి రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని కొత్తపల్లి పొలాల్లో రైతులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పసుపు పంటకు క్వింటాకు రూ.10వేలు కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేసి ఉదయగిరిలో పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు ఏర్పాటు చేయాలన్నారు. వెంటనే పసుపు ప్రభుత్వమే రైతు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేలా జైలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు స్పందించి పసుపు రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, కూలీలు గ్రామస్తులున్నారు.

మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాల్

గిరిజనులకు ఆలయ ప్రవేశం కల్పించాలి

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు రూరల్ మండలం వావిలేటిపాడు కొత్త గిరిజన కాలనీలో నివసిస్తున్న సుమారు 40 గిరిజన కుటుంబాల వారికి ఆలయ ప్రవేశం కల్పించాలని కెవిపిఎస్ నాయకులు అధికారులను కోరారు. ఈ సందర్భంగా వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మార్చి 23వ తేదీ ఉగాది పండుగ సందర్భంగా కాలనీకి పక్కనే ఉన్న మహాలక్ష్మమ్మ దేవాలయంలో టెంకాయలు కొట్టి పొంగళ్లు పెట్టుకునేందుకు వెళ్లగా అక్కడున్న పెత్తందారులు వారిపై వివక్ష చూపించి, చల్లా యానాదులకు దేవాలయ ప్రవేశం లేదని అడ్డుకొని వెనక్కి పంపించారని తెలిపారు. జరిగిన ఘటనపై జిల్లా కలెక్టర్, నెల్లూరు రూరల్ తహశీల్దారు, ఎస్ఐ స్పందించి గిరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాలు, డివిఎంసి మెంబర్ శేషం సుదర్శన, శాంతమ్మ, శ్రీనివాసులు, రమణయ్య, సంజీవమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలోని రామాలయం సమీపంలోని పండ్లు వ్యాపారి రంతూభాషా తన సోదరుడు సైదాతో కలిసి ప్రతి శ్రీరామ నవమి ఉత్సవాలలో చివరి రోజు భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ సారి కూడా శనివారం తన కుటుంబ సభ్యులతో కలిసి స్వయంగా తయారు చేసిన భోజనాన్ని దాదాపుగా 1000 మందికి అందించి తమ భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పాలకమండలి చైర్మన్ సేగు శ్రీనివాసులు రంతూ, ఆయన కుటుంబ సభ్యులను సత్కరించారు.

'చలో ఢిల్లీ' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కావలి

కార్మికుల, కర్షకుల ఐక్యతతో 5వ తేదీన నిర్వహించ తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పట్టణ సి.ఐ.టి.యు. నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో అందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను సిఐటియు నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్ మాట్లాడుతూ 5న కార్మికుల కర్షకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికుల కర్షకుల సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలం చెందిందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తూ కార్మికుల కుటుంబాలను రోడ్డుపాలు చేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా నిరుద్యోగుల సంఖ్య పెరిగి పోతుందన్నారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులు, కర్షకులు, రైతులు వ్యవసాయ కార్మికులు, అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం పట్టణ సహాయ కార్యదర్శి పెంచల

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

నరసింహం మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన అనంతరం రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర, కార్మికులకు కనీస వేతనాలు, నిరుద్యోగుల సమస్య పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వంత పాడుతూ పరిపాలన సాధిస్తుందని, దొందూదొందుగానే ఉన్నాయన్నారు. కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికులు పోరాటాల ద్వారానే ఈ రెండు ప్రభుత్వాలకు తగినగుణపాఠం చెప్పాలన్నారు. కార్మికులు రైతులు సమస్యల పరిష్కారం కోసం సమక్యంగా కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి మధుసూదన్ రావు, పాశం కోటేశ్వరరావు, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే సిఎం లక్ష్యం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మహిళలను ఆర్థికంగా బలవంతులుగా మార్చే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, ఈ పథకాలతో మహిళలు వారి కుటుంబాలను మరింత వృద్ధిలోకి తెచ్చుకోవాలని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ఆసరా 3వ విడత నగదు చెక్ పంపిణీ కార్యక్రమానికి ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం పొదుపు మహిళలు పూలవర్షం కురిపిస్తూ ఎంఎల్ఎకు అపూర్వ ఆహ్వానం పలికారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం గురించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన సందేశాన్ని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి ఆవిష్కరించి అందరికీ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డిని, అధికారులు, ప్రజాప్రతినిధులను మెప్మా సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాను ఇచ్చిన మాట ప్రకారం 3వ విడత వైఎస్ఆర్ ఆసరా నగదు మహిళల ఖాతాల్లో జమ

మాట్లాడుతున్న ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేశారని, ఎన్ని కష్టాలు ఎదురైన ఇచ్చిన మాట ప్రకారం జగనన్న అందరికీ సంక్షేమ పథకాలను వర్తింపచేస్తున్నారన్నారు. మహిళలు ఆర్థికంగా బలవంతులుగా మారి తమ కుటుంబాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా మహిళలు, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కరుణకుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్ బాబు, మెప్మా పిడి డి.రవీంద్ర, వైసిపి పట్టణ కన్వీనర్ అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, జెడ్‌పిటిసి డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, సిండికేట్ ఫార్మర్ సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, వైసిపి నాయకులు ఇందూరి వెంకటరమణారెడ్డి, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు, మెప్మా సిఒ మాధవి, మెప్మా సిబ్బంది, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలోని ఇస్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సుబ్బయ్య బడి జెడ్‌పి హైస్కూల్, నార్త్ మోపూరు జెడ్‌పి హైస్కూల్, మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల అలాగే నార్త్ ఆములూరు గ్రామంలోని చైల్డ్ ఆశ్రమంలో శనివారం 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు దాత పురిణి మస్తాన్‌రెడ్డి సుమారు 252 మందికి ప్యాడులు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ ఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ దండా కృష్ణారెడ్డి, కావలి ఎఎంసి వైస్ చైర్మన్ ఊటు శ్రీకాంత్ రెడ్డి, బీద రమేష్ యాదవ్, ఎంపిపి దర్శిగుంట శశిరేఖ, జెడ్‌పిటిసి చలంచర్ల వేణమ్మ, పడమర గోగులపల్లి సర్పంచ్ ఆట తిరుమల, ఎంపిటిసి రఘు, రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆట మధు తదితరులున్నారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి మర్రిపాడు క్లస్టర్‌కు చెందిన రైతులు 768పొగాకు బేళ్లను రైతులు వేలం కేంద్రానికి తీసుకువచ్చారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వీటిలో 725 బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్తులు కొనుగోలు చేశారన్నారు. వివిధ కారణాలతో 25పొగాకు బేళ్లను తిరస్కరించారని తెలిపారు. అధిక బరువుతో ఉన్న 18పొగాకు బేళ్లను వేలానికి తిరస్కరించారు. వీటిలో ఎన్ఎస్06 ఎన్ బి 12 సి ఆర్ 07 ఉన్నాయన్నారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.200 కాగా కనిష్ఠ ధర రూ.183, సగటు ధర రూ.194.70నమోదు కాగా, వేలంలో 8మంది కంపెనీ వ్యాపారస్తులు పాల్గొన్నారన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-వరికుంటపాడు

వేసవి కాలంలో ప్రజల దాహార్తిని దృష్టిలో ఉంచుకొని వరికుంటపాడు ఆటో యూనియన్ సభ్యులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమని ఎస్ఐ బాల మహేంద్ర నాయక్ అన్నారు. మండల కేంద్రం కాబట్టి పరిసర గ్రామాల నుంచి ప్రజలు ఎక్కువమంది వరికుంటపాడు వస్తుంటారు. అలాంటి వారందరికీ ఈ చలివేంద్రం సౌకర్యంగా ఉంటుందని అన్నారు. అనంతరం ఆటో యూనియన్ సభ్యులను సబ్ ఇన్‌స్పెక్టర్ బాల మహేంద్ర నాయక్, సర్పంచ్ కొండేపోగు దిలీప్ కుమార్ అభినందించారు.

పరీక్షా కేంద్రంలో పరిశీలిస్తున్న ఎంఇఒ మస్తాన్‌వలీ

రేపటి నుంచి పది పరీక్షలు

ప్రజాశక్తి-ఉదయగిరి

10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి జరుగుతాయని ఎంఇఒ షేక్ మస్తాన్ వలీ తెలిపారు. శనివారం సెంటిమేరీస్ ప్రైవేట్ పాఠశాల పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మౌలిక చదువు సదుపాయాలపై ఆరా తీశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సెయింట్ మేరీస్ ప్రైవేట్ ఉన్నత పాఠశాల, గండిపాలెం గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగు కేంద్రాలలో 656 మంది రెగ్యులర్ ప్రయివేటు విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. ఈ పరీక్షలు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆయన కోరారు.

మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి-కోవూరు

ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. స్థానిక సాయిబాబా మందిరం, బస్టాండ్ వెనుక ఉన్న లే అవుట్ లో శనివారం ఉదయం మహిళ మృతదేహం ఉండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 40 సంవత్సరాలు వయస్సును ఆ మహిళను తలపై బలంగా కొట్టడం కారణంగానే చనిపోయినట్లు పోలీసులు గుర్తించారు. హత్య కాబడ్డ మహిళ స్టూవ్ బీడీ కాలనీకి చెందిన మహిళగా గుర్తిం చారు. మహిళ వివరాలు తెలిస్తే అసలు నిజాలు వెలుగుచూడనున్నాయి. హత్య కేసు నమోదు చేసిన కోవూరు పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహిళ వివరాల కోసం ప్రయత్నిస్తున్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని నిరసన

ప్రజాశక్తి-జలదంకి

మండలంలోని కమ్మవారిపాలెంలో శనివారం రైతు భరోసా కార్యాలయం ఉద్యోగులను, సచివాలయం కార్యాలయం ఉద్యోగులను బయటకు పంపి స్థానిక రైతులు తాళాలు వేసి ధాన్యం కొనుగోలు చేయనందుకు నిరసనగా దీక్ష చేపట్టారు. రైతు భరోసా కార్యాలయం ఎదుట టెంటు వేసుకొని ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు దీక్ష వహించారు. ఈ సందర్భంగా వారు 6,7 తేదీల్లో జాయింట్ కలెక్టర్ డిఎంలు వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పి 25వేల బస్తాలు ఇచ్చి ఇప్పటి వరకు బస్తాలకు ధాన్యం నింపి నట్లు వేసుకున్న తరువాత ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తీవ్రమైన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పది రోజుల క్రితం డిఎంలు జాయింట్ కలెక్టర్ ఇదిగో వచ్చి.. అదుగో వచ్చి.. ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పినట్లు తెలిపారు. కానీ ఒక్క గింజ కూడా ధాన్యం కొనుగోలు చేయలేదని రైతులు వాపోయారు. అందుకనే దీక్ష చేపట్టాల్సి వచ్చిందని హెచ్చరించారు. తమకు న్యాయం చేయకపోతే పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడాల్సి వస్తుందని, అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ముందుగా డీటీ వచ్చి హామీ ఇచ్చిన రైతులు దీక్ష విరమించడం కుదరదని, డిఎంను పిలింపించి హామీనిస్తే గానీ తాము దీక్షను విరమించుకోలేమని రైతులు

ఆర్‌బికె ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఉద్ఘాటించారు. ఈ మేరకు సాయంత్రం 5 గంటలకు డిఎం వచ్చి 6వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన తరువాత అప్పుడు దీక్ష విరమించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు మాల్యాద్రి, రైతు సంఘం మండలం కార్యదర్శి గడ్డం మాల్యాద్రి, పూర్తి సంఘీభావం తెలియజేసి రైతుల పోరాటానికి మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ రైతుల ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసేంత వరకు రైతులు పోరాటం చేయాలని వారు పిలుపునిచ్చారు. భవిష్యత్తులో వారు చేసే పోరాటానికి వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం పూర్తి మద్దతు ఉంటుందని తెలియజేశారు. గ్రామ సర్పంచ్ తమ్మినేని సతీష్, రైతుల నాయకుడు అప్పలనాయుడు, రాజగోపాల్, తదితరులున్నారు.

వ్యాధినిరోధక టీకాలు పంపిణీ

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని పోలిరెడ్డిపల్లి వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రోస్‌లీన్ శనివారం పరిశీలించారు. టీకా కార్యక్రమం చేస్తున్న ఆరోగ్య సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుంపులు గుంపులు ఉండకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో ఏమైనా పనులు ఉంటే ఉదయం 8 నుండి 11 గంటల్లోపు చూసుకోవాలని సూచించారు. ఎండ తీవ్రతకు వడదెబ్బల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకొని సురక్షితంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిజి సాగర్ మేరీ, హెల్త్ అసిస్టెంట్ ఖాజా ముబారక్, ఎఎన్ఎం సుప్రియ, ఆశా కార్యకర్తలు భవాని, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన గుంటుపల్లి దంపతులు

ప్రజాశక్తి-కావలి : మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, జోన్ -3 ఆర్ టిఎస్ కో-ఆర్డినేటర్ గుంటుపల్లి శ్రీదేవిచౌదరి, కావలి నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి శనివారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. జోన్-3 పరిధిలోని 5 పార్లమెంట్ల పరిధిలోని 35 నియోజకవర్గాల్లో జరుగుతున్న ఆర్‌టిఎస్ కార్యక్రమాలను ఆమె వివరించారు.

ఫస్ట్ ఎయిడ్ బాక్సులు వితరణ

ప్రజాశక్తి-కావలి : కావలి డిపో పరిధిలోని దాదాపు 100 బస్సులలో ఫస్ట్ ఎయిడ్ బాక్సుల నిర్వహణ కోసం ప్రముఖ వైద్యులు, డాక్టర్ రామస్వామి వితరణగా మెడికల్ కిట్లను అందజేశారు. ఈ మేరకు రూ.30 వేల విలువ చేసే బాండేజ్ సామాగ్రిని ఆయన కావలి డిపో అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు మాట్లాడుతూ ఆర్‌టిసి అభివృద్ధికి డాక్టర్ రామస్వామి ఎల్లప్పుడూ సహకరిస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలో కార్మికులు, ప్రయాణికుల కోసం అవగాహనా సామాగ్రిని అందజేశారని తెలిపారు. ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే ప్రాథమిక చికిత్స అందజేస్తే, గాయపడిన వారి ప్రాణాలను కాపాడే అవకాశాలు ఎక్కువన్నారు. సిబ్బందికి ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించడంతో పాటు ఫస్ట్ ఎయిడ్ బాక్సుల నిర్వహణకు దాతల సహకారం తీసుకుంటున్నామని, ఈ విషయం డాక్టర్ రామస్వామికి తెలుపగానే మెడికల్ కిట్లను అందజేశారని వివరించారు. కార్మికులు, ప్రయాణికుల పక్షాన డాక్టర్ రామస్వామికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కెవియార్ బాబు, తదితరులు పాల్గొన్నారు.